క్లుప్తంగా

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు



జగన్నాథపురంలో ఆక్రమిత ప్రదేశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజారావు

బొబ్బిలి రూరల్: ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.రాజారావు హెచ్చరించారు. మండలంలోని జగన్నాథపురంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ కల్యాణ చక్రవర్తి, వీఆర్ఓ నాగరత్నం శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి, ఆక్రమిత ప్రదేశాలను పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను ఎవరూ ఆక్రమించినా శిక్ష అనుభవించక తప్పదన్నారు.

'బొబ్బిలి ఫ్రెండ్స్ సర్కిల్ యూత్' ఔదార్యం



గిరిజనులకు సోలార్ ప్యానెల్, లైట్లు అందజేస్తున్న బొబ్బిలి ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ సభ్యులు

బొబ్బిలి రూరల్: బొబ్బిలి ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ ఔదార్యం చాటుకుంది. మండలంలోని చినఅక్కేనవలస గిరిజన గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేని 11 కుటుంబాలకు విద్యుత్ సదుపాయం కల్పించారు. సభ్యులు పితాని శ్రీనివాసరావు, ప్రశాంత్, కుమార్, నరసింహమూర్తి, సందీప్, నాగార్జున, సంతోష్, నాయుడు, మురళి, రమేష్, మణి చందాలు వేసుకుని పోగుచేసిన రూ.30 వేలతో సోలార్ ప్యానెల్, విద్యుత్ దీపాలు కొనుగోలు చేసి, శుక్రవారం అందజేశారు. అలాగే గ్రామానికి నాలుగు వీధి దీపాలు వితరణ చేసి, గ్రామంలో వెలుగులు నింపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు యూత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సాయికృష్ణ

రామభద్రపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తాగునీరు, మజ్జిగ చలివేంద్రాలు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాయికృష్ణ మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్యాలయానికి వచ్చేవారంతా తాగునీటికి ఇబ్బంది పడకుండా వీటిని ఏర్పాటు చేశామన్నారు. మండలం, గ్రామ పరిధిలోని మరికొన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



స్వయం శక్తి సంఘాల మహిళలకు సూచనలిస్తున్న ఏపీఎం మంగమ్మ

రేగిడి: మహిళలంతా ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం పి.మంగమ్మ ఆకాంక్షించారు. శుక్రవారం మండలంలోని రేగిడి, ఆమదాలవలస, అప్పాపురం గ్రామాల్లో స్వయం శక్తి సంఘాల మహిళలతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ స్వయం శక్తి సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తోందని, ప్రభుత్వ అవకాశాలను మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకుని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నించాలన్నారు. స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు.

వంటకాలు రుచి, శుచిగా ఉండాలి



మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని గడిముడిదాం ఎంపీయూపీ పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి, పరిశీలించారు. మెనూ ప్రకారం వంటలు వండాలని, అవి కూడా రుచిగా ఉండాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు వేడినీటిని తాగేందుకు అందించాలన్నారు. అంతకుముందు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన కేంద్రంలోని పిల్లల హాజరు, వారికి అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు.

కుక్కలు భౌబోయ్!



- గ్రామాల్లో పెరిగిన వీధికుక్కల బెడద
- శునకాల బారినపడి గాయాలపాలవుతున్న జనం
- 50 రోజుల వ్యవధిలో 261 మంది ఆస్పత్రిపాలు
- కానరాని అధికారుల చర్యలు



రాజాంలోని ఈశ్వరనారాయణ కాలనీలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

రాజాం సిటీ: మండలంలో కుక్కల బెడద ఎక్కువైంది. వీటి బారినపడి ఆస్పత్రి పాలవుతున్న బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రాజాం పట్టణంలో అయితే విచ్చలవిడిగా గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట రోడ్లపై సంచరించే వాహనదారులు, పాదచారులపైకి కుక్కలు ఎగబడి దాడి చేస్తున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి ఇప్పటివరకు మొత్తం 261 మంది వరకు కుక్కకాటుకు గురై, రాజాం ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు సూపరింటెండెంట్ జీవీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఇదిలా ఉండగా, రాజాం నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని అన్ని గ్రామాల్లోనూ వీధి కుక్కల సంచారం ఎక్కువైంది. ఇవి మనుషులపైనే కాకుండా లేగదూడలు, కోళ్లపైన కూడా దాడి చేసి, గాయపరుస్తున్నాయి. ఒక్క రాజాం ఆస్పత్రిలోనే కాకుండా పీహెచ్‌సీల పరిధిలో కూడా కుక్కకాటుతో గాయాలపాలై, చికిత్స పొందుతున్న వారి సంఖ్య అధికమవుతుండడం విచారకరం.

చిన్నారులపై వరుస దాడులు..

రాజాం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ పట్టణ వాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ నెల 15వ తేదీన బొబ్బిలి జంక్షన్‌లోని చిన్న వీధిలో ఆడుకుంటున్న చిన్నారి జయసూర్యను కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. ఈ నెల 22వ తేదీన రేగిడి మండలంలోని పారంపేటలో ఓ వీధిలో ఆడుకుంటున్న ఏడేళ్ల చిన్నారి కడగల తేజను కూడా కుక్కలు కరిచి ఆస్పత్రిపాలు చేసింది. అలాగే ఈ నెల 23వ తేదీన పెనుబాక గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఈశ్వరమ్మ అనే మహిళను శునకాలు తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల భయంతో పిల్లలను ఆరుబయటకు పంపించేందుకు కూడా తల్లిదండ్రులు భయపడుతున్నారు. పిల్లలు ఆటలాడుకునే సమయంలో కుక్కలు ఎక్కడ వారిని కరుస్తాయోనన్న భయాందోళన సర్వత్రా నెలకొంది.

ప్రధాన రోడ్లలో పరిస్థితి ప్రమాదకరం..

పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం రోడ్డు, చీపురుపల్లి రోడ్లతో పాటు బొబ్బిలి రోడ్లలో కూడా పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. కుక్కలు రోడ్డుపైకి వచ్చి, అటువైపుగా వచ్చే వాహనదారులు, పాదచారులపైకి ఎగబడుతున్నాయి. ఒక్కోసారి కుక్కల బారి నుంచి తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి వాహనాలు బోల్తాపడి వాహనదారులు గాయపడిన ఘటనలు చాలా ఉన్నాయి. గతంలో మున్సిపల్ అధికారులు బ్లూక్రాస్ ఆధ్వర్యంలో కుక్కలకు కు.ని(కుటుంబ నియంత్రణ) చికిత్సలు చేసేందుకు ఆర్భాటం చేసిన అధికారులు తర్వాత వదిలేశారని పట్టణ వాసులు వాపోతున్నారు. ప్రజా అవసరాలు, ప్రజా సమస్యలు తీర్చాల్సిన అధికారులే ఇలా చేస్తే ఎలా అని అధికారుల తీరును ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వీధి కుక్కలను బంధించి వాటికి ఇంజక్షన్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

దేవస్థానం భూమి ఆక్రమణపై ఫిర్యాదు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని డోలపేట ఉమామహేశ్వర లక్ష్మీనారాయణస్వామి దేవస్థానానికి సంబంధించిన భూమి ఆక్రమణపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వీబీ రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు. కేర్ హాస్పిటల్ రోడ్డులోని దేవస్థానం భూమికి సంబంధించి, హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశామని, అయినప్పటికీ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఈఓ బీవీ మాధవరావు ఫిర్యాదు చేశారన్నారు. సదరు భూమిని ఆక్రమణలకు పాల్పడుతున్న డోలపేటకు చెందిన మీసాల ఆదినారాయణతో పాటు అతడి కొడుకు శ్రావణ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారని వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

పెరటికోళ్ల పంపిణీ



పెరటికోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: మండల కేంద్రంలో వెలుగు శాఖ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు పెరటికోళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ ఇంటి వద్దనే ఉండి, చిన్నపాటి పెట్టుబడితో కోళ్లు పెంచుకోవడం ద్వారా చక్కని ఆదాయం సంపాదించవచ్చన్నారు. ఏపీఎం దేవుడుబాబు మాట్లాడుతూ మండలంలోని 30 యూనిట్ల మేర పెరటికోళ్ల పంపిణీ చేపట్టామని, ఒక్కో యూనిట్‌లో 11 కోళ్లు ఉంటాయన్నారు. వీటితో పాటు 50 కిలోల కోళ్ల దాణా, మెడికల్ కిట్‌లు కూడా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగిడి రాంబాబు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి చేతుల మీదుగా మహిళా సంఘాల సభ్యులకు పెరటికోళ్లు పంపిణీ చేశారు. మొత్తం 30 యూనిట్లు అందజేశామని, ఒక్కో యూనిట్‌లో 11 గిరిరాజా కోళ్లు ఉంటాయని, వీటిలో 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయని ఎంపీపీ తెలిపారు. ఒక్కో యూనిట్ విలువ రూ. 3,750 అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.శాంతికుమారి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ ఎ.భాస్కరరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి రూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామ రైస్‌మిల్లుల్లో ఎస్‌డీసీ వెంకటేశ్వరరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మిల్లింగ్, లెవీ ఏ మేరకు ఆడారో పరిశీలించడంతో పాటు స్టాకు, రికార్డులు చూసి మిల్లరుకు పలు సూచనలు చేశారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

వంగర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేతనదారులు కోరిన చోట పనులు కల్పించాలని, ప్రతీ గ్రామంలో పనులు జరిగేలా చూడాలన్నారు. అర్హులైన వారందరికీ జాబ్‌కార్డు అందజేసి, పనులకు అనుమతించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామంలో రాజాం జీఎంఆర్ ఐటీ ఎన్.ఎస్.ఎస్(నేషనల్ సర్వీస్ స్కీమ్) విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జీఎంఆర్ వరలక్ష్మి కేర్ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

అరసాడ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు

వంగర: మండలంలోని అరసాడ గ్రామానికి కొత్తగా మంజూరైన పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)కి వైద్యులు కలమట ఈశ్వరరావు, బెల్లంకొండ సౌమ్యలను నియమించినట్లు జిల్లా వైద్యశాఖాధికారి కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం అరసాడ పీహెచ్‌సీ ఇంకా ప్రారంభం కాకపోవడంతో సదరు వైద్యులు వంగర పీహెచ్‌సీలో విధుల్లో చేరారు.

ఉపాధి పనులపై గ్రామసభ

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పరనాయుడువలస, చాటాయవలస గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి, శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, గ్రామాల్లో చేపట్టిన పనులపై జరిగిన సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) సమీక్షించారు.

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి, గ్రామసభ నిర్వహించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఇదే పంచాయతీలో 20 రకాల ఉపాధి పనులు చేపట్టగా, ఈ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ బృందం చేసిన ఆడిట్ వివరాలను సభలో వివరించారు. మొత్తం రూ.68.04 లక్షల విలువైన పనులు జరిగాయని డీఆర్‌పీ రామకృష్ణ వెల్లడించారు.

రోజుకు రూ.257 వేతనం

తెర్లాం: నిర్దేశిత కొలతల్లో రెండు పూటలా ఉపాధి హామీ పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందని ఏపీఓ జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పణుకువలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన తొలుత వేతనదారుల మస్తర్లు తనిఖీ చేశారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు ఉండేలా చూసుకోవాలన్నారు.

ఒమ్మిలో 'పొలంబడి'

రాజాం సిటీ: మండలంలోని ఒమ్మి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కోత దశకు చేరుకున్న మొక్కజొన్న పంట దిగుబడికి పాటించాల్సిన మెలకువలను ఏఈఓ ఎం.రేణుకాసాయి వివరించారు. అనంతరం పంట దిగుబడిని అంచనా వేశారు.

'జగనన్న గోరుముద్ద' బాగుంది..

వంగర: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మండలంలోని నీలయ్యవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు బాగున్నాయని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. శుక్రవారం పాఠశాలను సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటకాలను రుచి చూసి పరిశీలించారు. పదార్థాలు రుచి, శుచితో ఉండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రతీ తరగతి గదికి వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు.

వైఎస్సార్ ఆసరా పథకంపై సమీక్ష

తెర్లాం: స్థానిక వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా పథకంపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడిందన్నారు. మూడో విడత ఆసరా పథకానికి సంబంధించి, మండల కేంద్రంలో ఈ నెల 31వ తేదీన సమావేశం నిర్వహించనున్నామని, ఈ సమావేశానికి మూడు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం వర్తించిన లబ్ధిదారులు, ఆర్థికంగా నిలదొక్కుకున్న మహిళలను ఆహ్వానించి, వారి అనుభవాలు సమావేశంలో తెలియజేసేలా వీఓఏలంతా తర్ఫీదు ఇవ్వాలన్నారు.

తహసీల్దార్ సందర్శన

తెర్లాం: మండలంలోని పెరుమాళి ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

అట్టలు, పెన్నుల వితరణ

తెర్లాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆల్ ది బెస్ట్ టెన్త్ క్లాస్ స్టూడెంట్స్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంఈఓ జె.త్రినాధరావు చేతులమీదుగా పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు వితరణ చేశారు. విద్యార్థులంతా బాగా చదువుకుని, మంచి మార్కులు సాధించాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ జి.సత్యనారాయణ, సీఎస్‌డీటీ భాస్కరరావు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికడదాం

బొబ్బిలి రూరల్: ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, నీటి వృథాను అరికడదామని ఎంపీపీ శంబంగి లక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇంకుడుగుంత నిర్మాణానికి శుక్రవారం ఆమె భూమిపూజ చేశారు. అనంతరం ఆమె వర్షపు నీటిని ఇంకుడుగుంతలోకి చేర్చి భూగర్భ జలవనరులను పరిరక్షిద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.శాంతికుమారి పాల్గొన్నారు.

'వైఎస్సార్ ఆసరా' లబ్ధిదారుల గుర్తింపు పూర్తి

బాడంగి: మండలంలోని మహిళా సంఘాల ద్వారా వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారుల గుర్తింపు పూర్తయినట్లు ఏపీఎం భాగ్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆమె మండలంలోని 949 గ్రూపులకు చెందిన 10,629 మంది లబ్ధిదారులకు రూ.4.70 కోట్ల మేర రుణమాఫీ వర్తించిందన్నారు. రుణమాఫీ నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 29వ తేదీన ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేయనున్నామన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వంగర: మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీరఘట్టం ఐసీడీఎస్ పీఓ పూర్ణిమ ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. కొత్తపేట–2, శ్రీహరిపురం కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, కింజంగి–3, కొత్తపేట–2, లక్ష్మీపేట, ఇరువాడ, గీతనాపల్లి, శ్రీహరిపురం, కొప్పరవలస–1 కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన వారంతా ఈ నెల 29వ తేదీలోగా వీరఘట్టంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

రాజాం సిటీ: స్థానిక సన్ స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహిస్తున్నామని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో విద్యాహక్కు చట్టం, పౌరుల ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కల్పించనున్నామన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో 'పది' ప్రశ్నపత్రాలు భద్రం

రేగిడి: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం చేరిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలను భద్రపరిచినట్లు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు తెలిపారు. రేగిడి, ఏపీపురం, సంకిలి, లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరగనున్నాయని, ఆయా సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్ల ఆధ్వర్యంలో ఈ ప్రశ్నపత్రాలను భద్రపరచడం జరిగిందన్నారు.

బాడంగి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పదో తరగతి ప్రశ్న పత్రాలు భద్రపరిచారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి స్టేషన్‌కు చేరుకున్న ప్రశ్నపత్రాలను కస్టోడియన్లు పెట్టెలో పెట్టి తాళం వేశారు.

వంగర: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలను ఎంఈఓ వై.దుర్గారావు సమక్షంలో భద్రపరిచారు.

1876 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు



మండల వ్యవసాయాధికారి శిరీష

బాడంగి: మండలంలో 12 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు సంబంధించి, 1876 క్వింటాళ్ల వరి, వేరుశనగ, పచ్చిరొట్ట, రాగులు, పెసర, మినుము విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామని మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాదిని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తూ 50 శాతం రాయితీపై విత్తనాల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నామన్నారు. వరి విత్తనాల్లో ఎంటీయూ–1121 రకం 107 క్వింటాళ్లు, బీపీటీ–3291(సోనామసూరి)రకం 327 క్వింటాళ్లు, బీపీటీ– 5204(సాంబమసూరి)రకం 97.5 క్వింటాళ్లు, బీపీటీ–2537(ఆర్‌జేఎల్) రకం 10 క్వింటాళ్ల చొప్పున కావాలని కోరామన్నారు. అలాగే కదిరీ రకం వేరుశనగ 31 క్వింటాళ్లతో పాటు కట్టెజనుము 102 క్వింటాళ్లు, పిల్లిపెసర 12 క్వింటాళ్లు, జీలుగ 71 క్వింటాళ్లు తెప్పిస్తున్నామని, వీటిని గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేస్తామన్నారు.

కుట్టుమిషన్ శిక్షణతో స్వయం ఉపాధి



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణార్థులు కుట్టిన దుస్తులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు శాంతికుమారి

బొబ్బిలి రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి ఆకాంక్షించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ఆమె పూర్తి స్థాయిలో కుట్టుమిషన్ శిక్షణ నేర్చుకుని, స్వయం ఉపాధి పొందాలని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, వెలుగు ఏపీఎం పీపీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

బొబ్బిలి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 29వ తేదీన వాహనాల వేలం వేయనున్నట్లు సీఐ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. రామభద్రపురం పరిధిలో నమోదైన కేసులో పట్టుబడిన ఓ లగేజీ ఆటోను రూ.80 వేలకు వేలం వేయనున్నామని, పాటదారులు వేలంలో పాల్గొని, వాహనాన్ని దక్కించుకోవాలని కోరారు.

రూ.40 వేలకే గ్లామర్ బండి..

బాడంగి: రామభద్రపురం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 29వ తేదీన వాహనాల వేలం వేయనున్నారు. జిల్లా ఎస్పీ సౌమ్యమిశ్రా ఆదేశాల మేరకు నిర్వహించే ఈ వేలంలో హీరో గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని రూ.40 వేలకు వేలంలో ఇచ్చేందుకు నిర్ణయించామని ఎస్ఐ జయంతి తెలిపారు. ఎవరైనా ఆ వాహనం కావాలనుకుంటే వేలంలో పాల్గొని, వాహనం సొంతం చేసుకోవాలన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు



కొండగూడేం సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి సూచించారు. శుక్రవారం మండలంలోని గరికిపాడు, సంతకవిటి, కొండగూడేం గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఉద్యోగులంతా సమయానికి విధులకు హాజరై, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతం చేయించాలన్నారు.

క్షయవ్యాధి నివారణకు కృషి చేద్దాం

ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని, బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో వ్యాధి నివారణపై శుక్రవారం ర్యాలీలు నిర్వహించి, వ్యాధి నివారణకు కృషి చేద్దామని వక్తలు పిలుపునిచ్చారు. అవగాహనతోనే వ్యాధి నివారణ సాధ్యమని, వారం రోజులుగా ఎడతెరిపిలేని దగ్గు, తీవ్రమైన జ్వరం, కఫంలో రక్తజీర ఉంటే క్షయ లక్షణాలుగా భావించి, ఆస్పత్రిని సంప్రదించి చికిత్స పొందాలని వైద్యాధికారులు సూచించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుని, తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని రూపుమాపవచ్చన్నారు. – సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: ర్యాలీలో పాల్గొన్న వైద్యులు రవికుమార్, దీక్షితారాణి



రేగిడి: ర్యాలీలో నినాదాలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



బొబ్బిలి రూరల్: పిరిడిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ


వంగర: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి, గ్రామస్తులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. నాడు–నేడు పనుల్లో వంగర పీహెచ్‌సీని రూ.12 లక్షల నిధులతో అభివృద్ధి చేశారని, మరో రూ.1.75 లక్షలతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది, మందులు కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఇంటిపన్ను వసూలు

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస, మిర్తివలస, ముచ్చర్లవలస పంచాయతీల్లో శతశాతం మేర ఇంటిపన్ను వసూలు చేయడం జరిగిందని ఎంపీడీఓ రమామణి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమె మండలంలోని 22 పంచాయతీల్లో చేపడుతున్న ఇంటిపన్ను వసూళ్ల పురోగతిపై సమీక్షించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను 22 పంచాయతీల్లో రూ.62,08,295 డిమాండ్ ఉండగా, ఇప్పటివరకు రూ.43,79,675 వసూలైందన్నారు. అలాగే నాన్ ట్యాక్స్ రూ.43,14,231 డిమాండ్ కాగా, రూ.36,92,932 వసూలు చేశామన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఇంటిపన్ను వసూళ్ల పూర్తికి కృషి చేయాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



బొబ్బిలి రూరల్: అలజంగిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



తెర్లాం: వెలగవలసలో బాలామృతంతో వంటకాలు తయారు చేస్తున్న మహిళలు

బొబ్బిలి రూరల్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ రూరల్ పీఓ విజయలక్ష్మి తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని అలజంగి, పిరిడి, పెంట, పారాది, గొర్లెసీతారాంపురం గ్రామాల్లో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎవరూ రక్తహీనతతో బాధపడకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తే పౌష్టికాహారం తీసుకుని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలామృతం పదార్థాల ప్రదర్శన..

తెర్లాం: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న బాలామృతంతో తయారు చేసిన ఆహార పదార్థాలను తప్పకుండా తినాలని ఐసీడీఎస్ బాడంగి పీఓ కె.రాజ్యలక్ష్మి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని కూనాయవలస క్లస్టర్ పరిధిలోని వెలగవలస గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా బాలామృతంతో తయారు చేసిన (వంటకాలు)పదార్థాల ప్రదర్శన చేపట్టి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, కూనాయవలస, వెలగవలస అంగన్‌వాడీ కార్యకర్తలు సింహాచలం, సత్యవతి, జి.సింహాచలం, ఎం.లక్ష్మి, కృష్ణవేణి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.